# సగం అక్కడా..
# సగం ఇక్కడా!

మంథా భానుమతి

# సగం అక్కడా.. సగం ఇక్కడా!

మంథా భానుమతి

# "సగం అక్కడా.. సగం ఇక్కడా!"

(అరిందం అనే లండన్ మామ్మ కథ)

స్వచ్ఛమైన కోనేటిలో అప్పుడే ఒక కమలం అరవిరిసి ఆకాశం కేసి చూసింది, ఆదిత్యుని తొలికిరణాలకోసం. నులివెచ్చని కిరణ స్పర్శ తగలగానే పులకించి పూర్తిగా వికసించి గర్వంగా తల ఎత్తి దినకరుడ్ని చూసింది, అందుకోవాలనే ఆదుర్దా ఏమో!

అరవింద అప్పుడే పధ్నాలుగేళ్ళు నిండి ప్రపంచాన్ని అర్థం చేసుకుంటోంది..

అరవిరిసిన కమలం వంటి స్వచ్ఛత, అమాయకత్వం.. ప్రకృతినీ, తన పురుషుడ్నీ అర్థం చేసుకుని ఆనందించాలనే ఉత్సాహం.. ఛెంగు ఛెంగున ఎగురుతూ, గలగల పారే నదిలా చైతన్యం మూర్తీభవించిన తత్వం.. అరవిందని చూస్తే చాలు అందరి హృదయాలూ ఆహ్లాదంగా స్పందిస్తాయి.

"అక్కా! బావగారొచ్చారు." ఎత్తు గడపల మీదినుంచి దూకుతూ తమ్ముడు అరుస్తుంటే అరవింద తత్తరపడి పెరట్లోకి పారిపోయి, కిటికీ లోంచి చూసింది, కనురెప్పలు అల్లల్లాడిస్తూ.

సిల్కు లాల్చీ పైజామా, అణచి వెనక్కి దువ్వినా ముందుకి దూకుతూ సగం నుదురు కప్పేస్తున్న నల్లని జుట్టూ.. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్లు ఎక్కడో చూస్తున్నట్లుండే విశాలమైన కళ్ళూ.. "ఆజానుబాహుం, అరవింద దళాయతాక్షం." అన్నట్లున్న భట్టుని చూడగానే అరవింద బుగ్గలు ఎర్రబడ్డాయి.

"అల్లుడుగారూ! రండి రండి.." తడబడుతూ మామగారు పిలుస్తుంటే, హుందాగా ఇంట్లోకి అడుగుపెట్టాడు భట్టు.

"రేపే తీసుకు రమ్మని చెప్పమన్నారు నాన్నగారు. ఎక్కువ సమయం లేదు.. సామాన్లన్నీ సర్దేస్తే.. కారు తీసుకొచ్చాను. మిమ్మల్ని కూడా రమ్మన్నారు."

అల్లుడి పొడి మాటల్ని అర్థం చేసుకోడానికి రెండు క్షణాలు పట్టింది మామగారికి.

అరవింద గుండెలు దడదడా కొట్టుకున్నాయి. రేపేనా! ఎప్పుడో వెళ్ళాలని తెలుసు కానీ.. ఇంత తొందరగా.. అనుకోకుండా ఎలా? బెదురుగా అమ్మని చూసింది.

అమ్మ హడావుడి పడుతూ కాఫీ, ఫలహారాలు తయారు చేస్తుంటే, పక్కన చేరింది.

"కొంచెం ముందు చెప్పచ్చు కదమ్మా?" సంతోషమో, దుఃఖమో తెలియని ఉద్వేగంతో అంది.

"ఎప్పటికైనా తప్పదు కదమ్మా! అమ్మా, నాన్నా, స్నేహితులూ, హితులూ అంతా అతనే నీకు. అర్ధం చేసుకుని, అణకువతో మసలుకో తల్లీ! చేస్తున్న పని ఆపేసి, ప్రేమగా కూతురి తల నిమిరింది.

అరవింద బేలగా చూసింది.

........................

అరవింద ఒక్క క్షణం ఆగి అంతా పరికించింది.

"ఏడు కొండలవాడా! గోవిందా.. గోవింద.." ఏడు కొండలూ భక్తుల నినాదాలతో ప్రతిధ్వనిస్తున్నాయి.

ఆవిడకి డెబ్బైఏళ్ళు పైనే ఉంటాయి. ఒక చేత్తో కర్ర దాటేసుకుంటూ, ఇంకొక చేత్తో పదేళ్ళ మనవరాలి చెయ్యి పట్టుకుని నెమ్మదిగా నడుస్తోంది. ఈ వయసులో కాలినడకన కొండకెళ్ళాల్సినంత మొక్కేముందో.. మధ్యలో మనవరాలి చెయ్యి వదిలేసి, నుదిటిమీద చెయ్యి ఆనించుకుని పైకి చూడబోయింది.

అంతలో పక్కనున్న పిల్ల ఒక్క గెంతు గెంతి ముందుకు పరుగెత్తింది.

"అమ్మీ!" బెదిరిపోయి అరుస్తున్న ముసలమ్మ వెనక్కి పడిపోతోంది.

సరిగ్గా ఆ మెట్టు దగ్గిరే ఉన్న అరవింద గట్టిగా పట్టుకుంది.

"నూరేళ్ళు చల్లగా ఉండు తల్లే.." వణుకుతున్న కంఠంతో దీవించింది అవ్వ.

"ఏమయిందవ్వా? మీరిద్దరే వస్తున్నారా?" కర్ర సరిగ్గా సర్ది, అవ్వ చెయ్యి పట్టుకుని నడిపిస్తూ అడిగింది అరవింద.

"అవును తల్లే.. కొడుకూ, కోడలూ వెళ్తున్న బస్సుకి టక్కరయ్యింది. కొడుకు ఎంటనే ఏడుకొండలాని దగ్గరికెల్లిపొయ్యాడు. కోడలు మూడునెల్లాయి మంచం పట్టి కోలుకుంది. మొక్కు తీర్చుకుందామని మనవరాలి తోడు తీసుకుని వెల్తున్నా.."

అరవిందకి ఆశ్చర్యం వేసింది.

కొడుకు పోయినా, కోడల్ని బ్రతికించినందుకు సంతోష పడుతున్న అవ్వని చూసి ఒక జీవితసత్యం నేర్చుకుంది అరవింద.

"ఆ బగమంతుడు మనకిచ్చిందాంతో సంతోసపడాలి.. పోయిందానికి ఏడవకూడదు.." గొణుక్కుంటూ వెళ్తున్న అవ్వని కళ్ళు పెద్దవి చేసి చూసింది.

"శీతోష్ణ సుఖ దుఃఖేషు సమస్సంగ వివర్జిత" తాతగారు చెప్పిన భగవద్గీతలో శ్లోకం గుర్తుకొచ్చింది.

యోగులు ఎక్కడో హిమాలయాల్లోనే ఉండరు. సరిగ్గా చూస్తే మన మధ్యలోనే కనిపిస్తూ ఉంటారు.

"అరవిందా! త్వరగా రా.. అడుగడుక్కీ ఆగుతూ, ప్రజా సేవ చేస్తూ, ఎప్పటికి చేరుకుంటాం? అయినా ఇంత దూరం ఎందుకటా రావడం.. నీ దేముడి గదిలో లేడా ఈయన?" మోకాలి పర్వతం చివరి మెట్టుమీద నిలబడి నవ్వుతూ పిలుస్తున్నాడు భట్టు.

బ్రహ్మసమాజ సిద్ధాంతాలని నమ్మే భట్టుకి ఏడుకొండలూ ఎక్కడం అనవసర ప్రయాసే అనిపిస్తుంది. దంపతులిద్దరూ కలిసి వెళ్ళాలన్న తండ్రి మాటకి ఎదురు చెప్పలేక వచ్చాడతను.

"తప్పు.. అలా అనుకోకూడదండీ. మన ఇలవేలుపు వెంకటేశ్వరస్వామి మహత్యం చాలా గొప్పది." అరవింద ఆయాసపడుతూ మెట్లెక్కి భట్టు పక్కన నిల్చుని లెంపలేసుకుంది, భక్తిగా కళ్ళు మూసుకుని.

"నువ్విలా నత్తనడక నడుస్తే రాత్రయిపోతుంది. చీకటడితే దారిలో పులులు ఉంటాయంటారు. అయినా అంత చేటు కష్టం ఏమొచ్చిందో నీకు.. నడిచి కొండ ఎక్కాలంటూ  నాకింత పనిష్మెంట్ ఇవ్వడానికి."

"అదిగో మళ్ళీ.. అలా మాట్లాడద్దన్నానా? ఇంత మంచి తోడునీ నీడనీ ఇచ్చినందుకూ.. పది కాలాల పాటు మమ్మల్ని ఇలాగే కలిసి ఉండనియ్యమనీనూ! అంతకంటే నాక్కావల్సిందేవుంటుంది చెప్పండి. అవునూ.. రాత్రయితే ఏం? భయమెందుకు.. ఇవేళ పున్నమి తెలుసా! పుచ్చపువ్వులాంటి వెన్నెల. ముందూ వెనుక కాగడాలు పట్టుకుని భక్తులు నడుస్తూనే ఉంటారు. వెన్నెల్లో తిరుమల ఎంత బాగుంటుందో!" పరవశంగా అంది అరవింద.

"సరి సర్లే.. త్వరగా నడు. వెన్నెల సంగతి కొండ మీదికెళ్ళాక చూద్దాం. అయినా నిన్నూ నన్నూ కలిపి పలుపుతాడేసి బంధించేశారు కదా.. కలిసుండక ఎలా తప్పించుకుంటానూ.." పక పకా నవ్వుతూ అంటున్న భట్టుని వింతగా చూసింది అరవింద, అందుకోవాలని చక చకా అడుగులు వేస్తూ.

పలుపుతాడు పశువులకి కదా వేస్తారూ.. అమాయకురాలైన అరవిందకి భట్టు మాటలు, ప్రవర్తన వింతగా అనిపించింది.

"నిజమే. ఎంత వెన్నెలున్నా, కాగడాలున్నా.. ఈ లోయల్లో పడితే! తలుచు కుంటేనే కాళ్ళు వణుకుతున్నాయి.. అవునూ! నిజంగానే వణుకుతున్నాయి. కాలుకి ఏదో గట్టిగా తగులుతోంది. నున్నని

రాయి. అమ్మో.. జారి పడిపోతున్నాను. ఎంత పెద్దలోయో! ఏడుకొండలవాడి గుడి గోపురం అదిగో.. పట్టుకోండి."

భట్టు చిరునవ్వుతో చూస్తున్నాడు, చేతులు కట్టుకుని.

అమ్మా! అమ్మా!" అరవింద భయంతో కళ్ళు మూసుకుంది.

ఉలిక్కి పడిలేచింది అరవిందం.

........................

"అమ్మో! ఇదంతా కలా!"

గడియారం రెండు కొట్టింది. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. ఒళ్ళంతా చెమటలు పట్టేస్తున్నాయి. మొహం మీదినుంచి ధారలుగా కారుతోంది. చెమట కళ్ళల్లోకి వెళ్ళిపోయి కళ్ళు రెండూ భగ భగా మండ సాగాయి.

మంచంమీదనుంచి లేచి, పక్కనే ఉన్న బల్ల దగ్గరికి వెళ్ళి మరచెంబులోని నీళ్ళు అలాగే ఎత్తి గడగడా తాగేసింది. కిటికీ దగ్గరికి వెళ్ళి తెర తొలగించి చూసింది.

అంతే.. ఒక్కసారి కళ్ళు పెద్దవయ్యాయి.

పుచ్చపువ్వులాంటి వెన్నెల. పెరడంతా పరచుకుంది. వెన్నెల్లో నందివర్ధనం పూలు ఆకాశంలోంచి కృష్ణుడు విసిరేసిన వెన్న ముద్దల్లా ఉన్నాయి. తన చెవుల్లోని హోరు తప్ప ఇంకే శబ్దం వినిపించట్లేదు.

కనిపించినంత మేరా జీవం ఉన్నవీ లేనివీ ఒక్కలాగే నిశ్చలంగా ఉన్నాయి.. చిత్రకారుడు వేసిన రంగురంగుల చిత్రపటం లాగ.

అరవిందం తలుపులు తీసుకుని పెరట్లోకి నడిచి అరుగు మీద కూర్చుంది. ఊహ తెలిసినప్పట్నుంచీ వెన్నెలంటే అంతే.. వ్యామోహం లాంటిది. రాత్రంతా అలా కూర్చుని ఆకాశంకేసి చూస్తూ ఉండమంటే ఇంకేం అక్కర్లేదు. పున్నమి చంద్రుడు తారలతో సహా ఆకాశంలో విహారం చేస్తున్నాడు.

"తారా చంద్రుల విలాసములతో

విరిసే వెన్నెల వరవడిలో.."

మాయాబజార్ లోని పాట గుర్తుకొచ్చి నవ్వుకుంది అరవిందం. చంద్రుడికి అతి దగ్గరలో ఉన్న తార దూరం నాలుగు కాంతి సంవత్సరాలు పైనట. అంటే కొన్ని కోట్ల మైళ్ళ దూరం. ఇంక కలిసి తిరిగే ప్రశ్నే లేదు. వాస్తవానికీ ఊహకీ ఎంత దూరం..

చిరుచలి.. కొద్దిగా వణికిస్తోంది.

లోపలికి వెళ్ళి శాలువా తెచ్చుకుని నిండుగా కప్పుకుంది.

స్థంబానికి ఆనుకుని కూర్చుని, నిశ్శబ్ద నిశీధిలోని మత్తుని ఆస్వాదిస్తూ.. అలా ఉండిపోయింది.

అక్కడున్న ప్రతీ చెట్టూ, పువ్వూ, కాయా వెన్నెలని ఆస్వాదిస్తూ మత్తుగా హాయిగా ఉన్నాయి. చాలా సేపు చందమామ కేసి చూస్తూ.. అలాగే నేలమీద వాలి నిద్రపోయింది, కోడి కూసేవరకూ..

.....................

పాల్దాల్లోంచి వచ్చిన పొగ పల్చగా పంచ అంతా పరుచుకుంది. పెరట్లోంచి అయిమూలగా ఉదయిస్తున్న సూర్యుడు నారింజ రంగు కిరణాలని గుమ్మం దగ్గరికి పంపి అక్కడ వేసిన ముగ్గు సొగసులు చూస్తున్నాడు. కోటలో తులశమ్మ ముద్ద మందారాలతో, నంది వర్ధనాలతో అలంకరించుకుని, అదాటుగా చూస్తే గుళ్ళో అమ్మవారి విగ్రహంలాగే ఉంది.

పంచకి ఆనుకునున్న పందిరిమీదున్న దొండతీగ కాయలు, ఆకుల వెనక్కాల దాక్కుని తొంగి చూస్తున్నాయి, ఎవరైనా కోయడానికి వస్తారేమోనని. పెరడంతా శుభ్రంగా కడిగి, నూతి పళ్ళెంలో కూర్చుని గిన్నెలు తోముతోంది పనిమనిషి నాగమణి.

"అరిందం గారూ! పాల బిందె ఇక్కడెట్టేశానమ్మా! తొందరగా వచ్చి లోపలెట్టేసుకోండి. నల్లపిల్లి గోడెక్కి తయారుగా ఉంది. ఓ పట్టు పట్టేద్దారనీ.."

పాలేరు వీరన్న కేకలకి మట్టెలు, పాంజేబులు శబ్దం చేస్తుండగా దేవుడి గదిలోంచి బైటికి వచ్చింది అరవిందం.

వంటింట్లోకి వెళ్ళి పాలడేగిసా పట్టుకొచ్చి గుమ్మం దగ్గర కింద పెట్టింది.

"ఇందులో వంపేయ్ వీరన్నా. నేనా బిందె ఎత్తలేకపోతున్నా."

"ఇదేం చిన్నా చితకా డేగిసానాండీ మరీ.." వినయంగా వంగుని అన్నాడు వీరన్న.

అరవిందాన్ని ఒకసారి చూస్తే మరీ మరీ చూడాలనిపిస్తుంది. అందులో ఆవేళ పొద్దున్న మరీ..

తలారా స్నానం చేసి, జుట్టు చివర వేలుముడి వేసింది. తెల్లని జుట్టు వీపంతా పరుచుకుని, గాలికి ఎగురుతున్న వెంట్రుకలు నుదిటిమీద పడుతున్నాయి. కనుబొమ్మలు కూడ తెల్లగా అయి, అర్ధరూపాయ కాసంత కుంకంబొట్టుని మరింత ఎర్రగా కనిపించేలా చేస్తున్నాయి. పొందిగ్గా గోచీపోసి కట్టిన ఎర్రంచు నీలం పట్టుచీర నీరెండలో నిగనిగా మెరుస్తోంది. రెండేసి జతల బంగారు గాజుల మధ్య

అరడజను ఎఱ్ర గాజులు పాల దేగిసా కింద పెడుతుంటే గలగల మన్నాయి. మెళ్ళో ఉన్న పుస్తెల తాడు, నల్లపూసల మీద ఉదయకిరణాలు పడి, అవి పైకి పాకి ఆవిడ మోము వింత కాంతితో వెలిగి పోతోంది.

పట్టుబట్టలు కట్టి అప్పుడే అష్టోత్తరం పూజ చేసిన పార్వతీ అమ్మవారిలా ఉంది అరవిందం.

బిందిలో పాలు, దేగిసాలోకి వంపి, అప్రయత్నంగా నమస్కరించాడు వీరన్న.

"అదేమిటో.. రోజూ ఈ దణ్ణం ఎందుకురా అంటే వినవూ.." నవ్వుతూ అంది అరవిందం. ముత్యాల్లాంటి పలువరుస తళుక్కున మెరిసింది. దేగిసా తీసుకెళ్ళి పాల్దాలి మీద పెట్టి, కింద పిడకల్ని సర్దింది.. వేడి సమంగా వచ్చేలా.

"రోజూ అమ్మోరి దర్శనం చేసుకున్నట్టుంటుందమ్మా. అవునుగానీండి.. మీరు పెళ్ళికెళ్ళలేదేటండీ? అక్కడేటో అంతా బోసిపోయుంటుంది."

"నాకెందుకో అన్నేసి రోజుల పెళ్ళిళ్ళకి వెళ్ళాలనిపించదు వీరన్నా! ఊపిరి సలపనట్లుంటుంది.. హాయిగా పాటలు పాడుకుంటూ ఎవరూలేని ఇంట్లో తిరుగుతుంటే ఎంత బావుంటుందో తెల్సా.. అయినా.. అందరూ వెళ్ళిపోతే ఇల్లెలా? పెళ్ళివాళ్ళు వచ్చేప్పటికి అంతా సర్దించి పెట్టడానికుండాలి కదా! లేపోతే అయ్యవారి నట్టిల్లులా ఉంటుంది."

"ఏటో.. అమ్మగారిదంతా చాదస్తం." నిట్టూరుస్తూ పెరట్లోకి వెళ్ళిపోయాడు వీరన్న, గొడ్లసావిడి బాగు చెయ్యడానికి.

"ఏనాటి నోము ఫలమో.." అని పాడుకుంటూ అరవిందం పనిలో పడింది.

చకచకా కొట్టు గదిలోకి వెళ్ళి కూరగాయలేమున్నాయో చూసింది. పెళ్ళివారు సాయంత్రానికి కానీ రారు. అప్పటికి పెరటి సావిట్లో గాడి పొయ్యి తవ్వేసి, అటక మీదనించి గుండిగలూ అవీ దింపేసి, సంత నుంచి కూరలు తెచ్చి వేరే వంటలూ అవీ మొదలు పెడ్తారు. మధ్యాన్నానికి ఏదయినా చేసుకోవాలి కదా!

ఉన్నది తానొక్కతే అయినా పాలేళ్ళు, పనివాళ్ళూ కలిపి పదిమంది. ముక్కలన్నీ వేసి పప్పులుసూ, వంకాయ ముద్దకూర చెయ్యమని వంటావిడకి పురమాయించి, అన్నిగుమ్మాలకీ తోరణాలు కట్టడానికి మండువాలో ఉంచిన మావిడాకుల దగ్గిర కూర్చుంటూ అటుగా పరుగెడుతున్నట్లు వెళ్తున్న పదహారేళ్ళ నాగమణిని పిలిచింది.

"అదేవే నాగమణీ అలా పారిపోతున్నావూ. ఇవన్నీ ఎవరు చేస్తారూ.. రా రా! ఇలా కూర్చుని ఆ పురికోస్తాడు తియ్యి." నాగమణి, వీరన్న కూతురు. అరవిందానికి సాయంగా ఉండి పోయింది పెళ్ళికెళ్ళకుండా. మూతి ముడుచుకుని వస్తున్న నాగమణిని చూసి నవ్వింది అరవిందం.

"ఓసోసి.. అంత కోపవేంటే? పెళ్ళికెళ్ళనియ్యలేదనే.. నే చెప్తూనే ఉన్నా. మీ నాన్నే మొండి పట్టు పట్టాడు. నాకు సాయంగా ఉంటావనీ.. వాడిదంతా చాదస్తం. ఎవరైనా ఎత్తుకుపోతారా నన్నూ! నా ఎఱ్ర పట్టుచీర చింపి నీకు పట్టుపరికిణీ కుట్టిస్తాలే! మొహానికి కాస్త నవ్వు పులువు.."

"ఎప్పుడో ఇస్తే ఏంలాభం అమ్మగారూ.. ఇప్పుడిచ్చారనుకోండి రేపు వ్రతానికేసుకుంటా." నాగమణి కోపం మర్చిపోయి మండువాలో కూలబడింది, అరవిందం పక్కనే.

"ఒకవేళ నే ఇచ్చినా ఇప్పటికిప్పుడు కుట్టి ఎవరిస్తారే రాణీగారికి.."

"దర్జీ శ్రీను నిన్ననే వచ్చాడమ్మగారూ! మీరు చెప్పారని చెప్తా. వెంటనే ఇచ్చేస్తాడు, లండన్ మామ్మగారు కదా మరీ.." దీర్ఘాలు తీస్తూ అంటున్న నాగమణిని చూసి నవ్వుతూ లేచింది అరవిందం.

అరవిందం పుట్టిన్రోజుకి బావగారి పిల్లలూ, మనవలూ అందరూ కలిసి కొనిచ్చిన పట్టుచీర. బరువుగా ఉందని కట్టలేకపోతోంది. పిల్లలు లేరని ఎప్పుడూ బాధపడలేదు అరవిందం..

బావగారి పిల్లల్నే తన కన్నపిల్లలనుకుంది. వాళ్ళ పిల్లల్ని స్వంత మనవల్లా చూసుకుంది.

జమీలు పోకముందరి సంగతి..

ఆ ఊరి జమీందారుగారి దివాన్, గణేశం పంతులుగారు. చుట్టు పక్కలున్న నాలుగైదూళ్ళకీ ఒకటే జమీ. బ్రిటిష్ ప్రభుత్వం ఉండగానే కొంత ఆస్థి దివాన్‌గారి పేరు మీద రాసేశారు జమీందారుగారు.

దివాన్ గారి పెద్ద కొడుకు అప్పల నరసింహంగారు తండ్రి వారసత్వం పుచ్చుకున్నారు. పంతులుగారి చిన్నకొడుకు నరసింహ భట్టు బారిస్టర్. వారి చిన్న కోడలు అరవిందం. అరవిందం పెళ్ళినాటికి బొంబాయిలో ప్రాక్టీస్ పెట్టాడు భట్టు.

జమీలు పోయినపుడు దివాన్ గారినే కరణంగా నియమించారు. తనదీ తమ్ముడిదీ ఆస్థిపాస్థులు చూసుకుంటూనే కరణం పని కూడా చూసేవారు అప్పలనరసింహంగారు. ఆయన పెద్ద కొడుకు ప్రస్థుతం ఆవూరి కరణం. తాతగారి పేరే. అందరూ పంతులుగారని పిలుస్తారు.

"అమ్మో! ఈ చీరనా అమ్మగారూ.." అంతంత కళ్ళేసుకుని ఆశ్చర్యంగా చూసింది నాగమణి.

నిజవేమరీ.. అరచెయ్యంత వెడల్పు తెల్లంచు జరీ చీర. ఎఱ్ఱటి రంగుతో వెండిమబ్బు అంచున్న సంధ్యాసమయంలో ఆకాశంలా ఉంది.

"అప్పుడెప్పుడో ఆరేస్తుంటే మేక్కి తగిలి మధ్యలో పఱ్ఱుమందే.. నిలువునా చిరిగిపోయింది. అతుకుచీర కట్టకూడదని అట్టేపెట్టాను."

నాగమణి మొహం చేటంతయింది. చురుగ్గా గంటలో వీరన్న సాయంతో మావిడాకులన్నీ తోరణాలు కట్టేసి తుఱ్ఱుమంది.

అరవిందం తృప్తిగా గుమ్మాలన్నీ చూస్తుండగా వచ్చాడు.. పొలంలో పనిచేసే పెద్దపాలేరు వెంకడు, వగర్చుకుంటూ!

......................

"అరిందంగారూ! కొంప మునిగిపోతోందండీ.." పాలేరు వెంకడు డెక్కుతూ అన్నాడు, వీధిలో మెట్లకింద నిలబడి. చెమటలో నాని.. నీళ్ళు కారుతూ నిల్చున్నాడు.

వెంకడిది కండలు తిరిగిన ఉక్కు లాంటి శరీరం. వెంకటేశ్వరస్వామి విగ్రహంలాగే నిలువెత్తున నల్లగా నిగనిగ లాడుతూ ఉంటాడు. అంత మనిషీ వణికి పోతున్నాడు.

"ఏవయింది వెంకన్నా! ఉండు.. కుండలో నీళ్ళట్టుకొస్తాను.. ఆర్చుకు పోతున్నావు వెఱ్ఱి వెధవన్నా.." అరవిందం గబగబా లోపలికి వెళ్ళి దండెం మీదున్న తువ్వాలూ, చిన్నకుండలో నీళ్ళూ తీసుకొచ్చి ఇచ్చింది.

వెంకడు కుండెడు నీళ్ళు గడగడా తాగేసి, తువ్వాలుతో మొహం వత్తుకుని కాస్త తేరుకున్నాడు.

అరవిందం కాపురానికొచ్చినప్పుడు వెంకడు ఏడాది పిల్లాడు. పాలేళ్ళంతా ఆవిడ కళ్ళముందు పుట్టిన వాళ్ళే.. అందర్నీ మాతృ వాత్సల్యంతోనే చూస్తుంది.

"అరిందంగారూ! టయం నేదండీ.. పెళ్ళోళ్ళొచ్చేత్తన్నారా! మన చిన్న కాలవలో నీళ్ళు ఉధృతంగా వచ్చేత్తన్నాయండి. వంతెనీవ్వల గండిపడి చెరువైపోతోందండి. మరి బళ్ళూళ్ళోకి ఎల్లా వత్తయ్యండే.."

ఊళ్ళో పెద్దలు, కుఱ్ఱకారూ అంతా పెళ్ళికెళ్ళారు. ఇప్పుడెలా.. అరవిందానికేం చెయ్యాలో తోచలేదు.. కానీ ఏదో చెయ్యాలి. ఈ పాటికి సగం దూరం వచ్చేసుంటాయి బళ్ళు.

ఇంట్లోకి వెళ్ళి ఉన్నపళంగా చెప్పులేసుకుని బైటికి వచ్చేసింది. ముందు వంతెన దగ్గరికెళ్ళి చూడాలి..

"అమ్మగారూ! మీరొత్తారా?" వెంకడు ఆశ్చర్యంగా అడిగాడు.

"మరీ.. ఏదో చేస్తాననే కదరా.. పరిగెట్టుకునొచ్చావూ? పెళ్ళికెళ్ళిన కూలీలంతా తిరిగొచ్చారా? వీరన్నా.. వాళ్ళందర్నీ పిల్చుకురా.. డ్రైవరున్నాడేమో ట్రాక్టర్ మీద ఇసుక బస్తాలేసుకు రమ్మను.. తోటలో బంగ్లా కట్టడానికట్టుకొచ్చారు కదా! ఇక్కడున్నట్లు రావాలి మరి." అరవిందం నడుస్తూనే, వెంకడి కేకలు విని ఏటయిందోనని గొడ్లసావిట్లోంచి నాలుగంగల్లో వీధిలో కొచ్చిపడ్డ వీరన్నకి ఆదేశాలిచ్చింది.

ఊర్లో అన్ని ఇళ్ళల్లో ముసలి వాళ్ళు తప్ప ఎవరూ లేరు.

అరవిందం చకచకా నడుస్తూనే ఆలోచిస్తోంది. బొంబాయిలో ఒకసారిలాగే వాళ్ళున్న కాలనీ జల దిగ్బంధం అయిపోయింది.. అప్పుడేం చేశారూ? జ్ఞాపకం తెచ్చుకుంది.

వంతెన దగ్గిర పరిస్థితి వెంకడు చెప్పిందానికంటే అధ్వాన్నంగా ఉంది. కాలువ వంతెనకింద కంటే మూడు రెట్లు వేగంతో బైట రోడ్డుమీంచి పారుతోంది. రోడ్డుమీద అడ్డంగా గండి పడిపోయింది.

వంతెన మీదనుంచి ఏ బండొచ్చినా గండి పడిన కాలువలో కొట్టుకుపోడం ఖాయం.

అరవిందం కబురు పెట్టకముందే గుమాస్తా గారు కూలీలందర్నీ క్రోడీకరించినట్లున్నారు.. యాభై మంది జెమా జెట్టీల్లాంటి వాళ్ళు వచ్చేశారు.

ఇంకా ట్రాక్టర్ రాలేదు.. బస్తాలేసుకుని రావాలి కదా!

"నమస్కారమమ్మా! మీరొచ్చారా. నేను మానేజిమెంటు చేసేవాణ్ణి కదా!" గుమాస్తా వినయంగా అన్నాడు.

"మన వాళ్ళలో గజ ఈతగాళ్ళెంత మందున్నారు?" అరవిందం అడిగింది, గుమాస్తా మాట వినిపించుకోకుండా.

"ఓ ఇరవై మందుంటారమ్మా. ఇది చూస్తే పంట కాలువ.. ఇలా పోటెత్తిన గోదార్లా అవడం ఇదే ఫస్టు టైం.."

అరవిందం సాలోచనగా చూసింది. దూరం నుంచి అంత వడి లేదు. వంతెన దగ్గరవుతున్న కొద్దీ ఎక్కువవుతోంది.

"ఈత బాగ వచ్చిన వాళ్ళని వంతెన కిందికెళ్ళి చూడమనండి. అడ్డున్న చెట్టుకొమ్మల్ని తీసి, ఒడ్డుకెయ్యమనండి. ఈ లోపు కొంతమందిని పరుగెట్టి గునపాలు, పారలు, గంపలు తెమ్మనండి..

త్వరగా. వంతెన కింద పూడిక తీయిస్తే.. ముందీ రోడ్డుమీద ప్రవాహం తగ్గుతుంది. అప్పుడు ఇసక బస్తాలేసినా ప్రయోజనం ఉంటుంది."

ఈ ఉపాయం తనకి తట్టనందుకు తిట్టుకుంటూ గుమాస్తా అందర్నీ తరిమాడు. అరవిందం చెప్పినట్లే.. ఎప్పుడు పడిందో పెద్ద వేపచెట్టు విరిగి, లావుగా ఉన్న దాని మొద్దు, కాలువకి అడ్డంగా వంతెన కింద పడింది. దాని చుట్టూ తుక్కులు, బంకమట్టి చేరి ఆనకట్ట కట్టేశాయి.

అదృష్టం.. వానొకటి లేదు. సరిగ్గా ఈతరాని కూలీలు గట్టుమీద నిలబడ్డారు. గజ ఈతగాళ్ళు.. నీళ్ళల్లో కొంచెం సేపు ఉండగలిగిన వాళ్ళు కాలువలోకి దిగారు. ముందు మొద్దు చుట్టూ ఉన్న మట్టి, చెత్తా చెదారం గంపల్తో తెచ్చి ఒడ్డున పడేస్తుంటే, అక్కడున్నవాళ్ళు పక్కనున్న తోటలో పడేశారు. అదయ్యాక.. ఇరవై మందీ కలిసి, వేప మొద్దుని నెమ్మదిగా నిలువుగా చేసి ఒడ్డుకి చేర్చారు.

అప్పుడు, వంతెనకింది నుంచి నీరు మళ్ళింది.

ఈ లోగా ఇసుక బస్తాలేసుకుని ట్రాక్టరు వచ్చేసింది. గండిపడిన రోడ్డు మీద దగ్గరుండి ఇసుక పరిపించి మట్టితో దిమ్మిసా చేయించింది అరవిందం. వంతెన వద్దనుంచి రోడ్డుమీద నడిచి, తృప్తిగా ఇల్లు చేరింది..

...................

పచ్చని పంట పొలాల మధ్యగా రెండు రెండెడ్లబళ్ళు గంటలు గణగణా మ్రోగించుకుంటూ వస్తున్నాయి. వెనుకగా నడవగలిగిన వాళ్ళంతా కబుర్లు చెప్పుకుంటూ వస్తున్నారు. నడవలేని వాళ్ళు కార్లలో, ఇంకా కుర్రకారు ట్రాక్టర్లలో ఊరేగింపులా వస్తున్నారు.

మొదటి బండిని ఆకు పచ్చని మామిడికొమ్మలతో, పసుపుపచ్చని బంతి, చామంతుల దండలతో అలంకరించారు.

ఊర్లోకి వస్తున్న పెళ్ళివారికి స్వాగతం పలుకుతున్నట్లు ఊగుతున్నాయి, చెరువు గట్టు మీద వరుసగా ఉన్న కొబ్బరి చెట్లు. గట్టు దగ్గర మలుపు తిరిగి ఒక మైలు వెళ్తే అన్నాపురం. అదే.. అరవిందం అడుగెట్టిన అత్తారూరు. ఆ వూరి కరణంగారి అబ్బాయీ..అప్పలనరసింహంగారి చిన్నమనవడూ అయిన కామేశ్వర్రావుకి, పక్కూరి పప్పోరిపాలెం మునసబుగారమ్మాయితో పెళ్ళయింది.

అంగరంగ వైభోగంగా ఐదురోజుల పెళ్ళి.

ఇరవయ్యొకటో శతాబ్దంలో కూడా తరతరాల సాంప్రదాయాల్ని పాటించాలనే కుటుంబం కరణం గారిది. అందుకనే తాత ముత్తాతలు ఉపయోగించిన రెండెడ్ల బళ్ళు ఎప్పటికప్పుడు బాగులు చేయిస్తూ.. కొత్తబళ్ళలా ఉంచుతారు. బోలెడు పాడి.. అందులో ఆవులే ఎక్కువగా ఉంటాయి.

ప్రతీ ఏడూ తొలి నాగలి ఎడ్లు పట్టాల్సిందే, ఆ తరువాత ట్రాక్టర్లు వాడినా..

బళ్ళు నడపడానికి కూడా రెండు జతల ఎడ్లు తయారుగా ఉంటాయి. శుభకార్యం వచ్చిందంటే ముందా బసవన్నలకి పూజ చేసి అలంకరించి, బండిలోనే కొంత దూరమన్నా ప్రయాణం చేస్తారు.

ఐదోరోజు తెల్లారకట్లే నాగవల్లి, దండాడింపు.. తలంటి స్నానాలు అయ్యాక, పెందరాళే భోజనాలు కానిచ్చి పెళ్ళివారు వెనక్కి మరలారు.

పెళ్ళికొడుకు, పెళ్ళి కూతురూ, బసవన్నలు తలలు ఆడిస్తూ స్వాగతం పలుకుతుండగా బండిలోకి ఎక్కారు. ఐదురోజుల పెళ్ళి వేడుకలతో అలసిపోయిన పెళ్ళికూతురు హేమలత, కళ్ళు మూతలు పడుతుంటే బండిలో వేసిన మెత్తటి పరుపుమీద జోగుతోంది.

అప్పటివరకూ, పెళ్ళి ఐదురోజులూ మధుపర్కంతో, సగం నుదురు కప్పేసిన నామంతో, తలనిండా జుట్టు కనిపించకుండా కమ్మేసిన అక్షింతలతో చూసిన భార్య.. మెత్తని కొత్త చీరలో, నుదుట తీర్చిదిద్దిన కళ్యాణం బొట్టుతో, పచ్చని పసుపుతాడుకి కట్టి మెరుస్తున్న మంగళ సూత్రాలు, నల్లపూసలూ బండి కుదుపులకి అటూ ఇటూ కదులుతుంటే.. అతివ అందాలని పరికించడంలో మునిగిపోయాడు పెళ్ళికొడుకు కామేశ్వర్రావు.

అలంకరించిన బండిలో విశాలంగా.. ముందు గడ్డిపరుపు, దాని మీద మెత్తటి బూరుగుదూది పరుపు. బండి గూడుకున్న మేకులు, పుల్లలు గుచ్చుకోకుండా చుట్టూ కొబ్బరిపీచు, గడ్డివేసి వెల్వెట్ బట్టతో కుట్టేశారు. అది చాలదన్నట్లు బాలీసులు, తలగడాలు.. సుఖంగా ఆనుకుని కూర్చోడానికి.

కరణంగారి పెద్దబ్బాయి నాని మంచి అభిరుచి, కళా హృదయం ఉన్నవాడు. తాతగారి పేరే.. ఇంటి ఆజమాయిషీ అంతా అతనిదే! ఒక్క బండేమిటి.. ఇంట్లో ప్రతీ మూలా, గొడ్లసావిడితో సహా స్వయంగా పర్యవేక్షిస్తాడు.

నూతన దంపతులు వచ్చే బండిలో ఇంకెవరూ ఎక్కకుండా ఏర్పాట్లు చేశాడు. ఆఖరికి.."బాబాయి, పిన్నితో నేనూ.." అంటూ ఏడుస్తున్న మూడేళ్ళకూతుర్ని కూడా బుజ్జగించి వెనక బండిలో నాన్నమ్మ దగ్గిర కూర్చోపెట్టాడు, ఇదేం చోద్యంరా అంటున్న తల్లి మాటలు పట్టించుకోకుండా.

అన్నయ్య కల్పించిన ఏకాంతాన్ని పూర్తిగా వినియోగించుకోడానికి వీల్లేకుండా ఉంది కాంబాబుకి.. మధ్యలో ఈ బండివాడొకడు. ఎడ్లని అదిలిస్తున్నట్లే ఉంటాడు.. అప్పుడప్పుడు ఓ కన్ను వెనక్కి వేస్తున్నాడు. రోడ్డుమీదున్న గతుకులు కొంత సాయం చేస్తున్నాయి, ఇతోధికంగా.

అప్పుడే పెద్దగుంటలో పడిన బండి చక్రం, హేమని ఎగరేసి కాంబాబు ఒళ్ళో పడేసింది. కనురెప్పల్ని బరువుగా ఎత్తి, పెద్దకళ్ళతో బెదురుగా చూసి, చటుక్కున లేవబోయింది.

ఊహూ! చీరకొంగు సంచీలు వేళ్ళాడ్డానికి పెట్టిన వంకీకి చిక్కుకు పోయింది. లేవబోతుంటే పమిటచెంగు పక్కకి తప్పుకుంటోంది. సరిచేసుకోబోతే చిరుగుతానంటూ సర్రుమని శబ్దం చేస్తోంది. కొత్తపెళ్ళికొడుకు చూపుల్లో కొంటెతనం. కొంగుతియ్యాలంటే తన మీదనుంచి వంగాల్సిందే.. హేమ మరింత బెదిరిపోయి, చిగురుటాకులా కంపిస్తూ నిస్సహాయంగా చూసింది.

ఒక్కనిముషం ఆగి, అగ్ని సాక్షిగా ఏర్పడిన ఏడడుగుల బంధం చాలదన్నట్లు పడిన కొత్త బంధాన్ని, బండి కుదుపులకు ఊగుతున్న ముద్దరాలి మోముని చూశాడు కాంబాబు. హేమ మరింత ముడుచుకుపోయింది.

ఎటూ కదలలేని పరిస్థితి. కాంబాబుకి కూడా కొత్తగానే ఉంది.. తన గుండె చప్పుడు తనకే మద్దెల దరువులా వినిపిస్తోంది. చేతులు, కాళ్ళు వణుకుతున్నాయి.. అయినా ఎంతో బాగుంది.

సావకాశంగా భార్యని చూశాడు.. పసుపు ఛాయలు పూర్తిగా వదలని చెంపలు.. సిగ్గుతో ఎర్రబడి, కొబ్బరాకుల్లోంచి పడిన సూర్యకాంతిలో పంచరంగుల్లో మెరుస్తున్నాయి. అదురుతున్న పెదవుల్ని చూస్తుంటే ఒక్కసారి తనపెదవుల్తో మూసి అభయం ఇవ్వాలనిపించింది. నుదిటి మీదున్న కళ్యాణం బొట్టు కొత్తకళని తీసుకొచ్చింది. ఆకుపచ్చని పట్టు చీరకి పసుపుపచ్చని తామరపూల అంచు చీర, ఒంటిమీదున్న నగల మెరుపుని మరింత పెంచుతోంది.

ఒకే ఒక కిరణం ముక్కుకున్న వజ్రపు ముక్కుపుడకమీద పడి సప్త వర్ణాల కాంతిని మోహమ్మీద పరిచింది. అలా ఉండిపోయేవాడేమో కానీ.. హేమ కళ్ళలో వేడికోలు చూసి చెయ్యి చాచి, వంకీకి చిక్కుకున్న కొంగుని విడిపించి.. భుజాలు పట్టుకుని కూర్చోపెట్టాడు భార్యని.

హేమ గుండె ఝల్లుమంది. కాళ్ళని మరింత ముడిచి, మోకాళ్ళమీద తల పెట్టి, వెనక్కి జరిగి.. పక్కకి తిరిగి, దారిఅంతా అధ్యయనం చెయ్యసాగింది. కాంబాబు మాత్రం తన పనిలో తానున్నాడు. ఏదో మాట్లాడదామని చూస్తాడు.. చెయ్యి చాచి, ముంగురులు సవరిద్దామని చెయ్యి పైకి లేపుతాడు.. అంతలో

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Sagam+Akkada+Sagam+Ikkada**

* * *